మితిమీరుతున్న సెవెన సీటర్స్, షేరింగ్ ఆటోల ఆగడాలు

అతివేగంతో ముంచుకొస్తున్న ప్రమాదాలు



ఎర్రగడ్డలో రోడ్డుకు రెండువైపులా నిలిపి ఉన్న షేరింగ్ ఆటోలు

ఎర్రగడ్డ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సెవెన్ సీటర్స్, షేరింగ్ ఆటోల ఆగడాలు మితిమీరుతున్నాయి. ఎర్రగడ్డ నుంచి మోతీనగర్, బోరబండకు వెళ్లే ఆటోలు అతివేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు ముంచుకొస్తున్నాయి. ఆటోడ్రైవర్లు తమ ఇష్టానుసారంగా నడుపుతూ, ఎర్రగడ్డ చౌరస్తాలో ఆటోలను నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ట్రాఫిక్ పోలీసులు ఉన్నా లేనట్లే వ్యవహరిస్తున్నారు.

ప్రేమ్‌నగర్‌కు వెళ్లే దారిలో..

ఆటోలను ఎర్రగడ్డ జేకే పాయింట్ హోటల్ నుంచి ప్రేమ్‌నగర్‌కు వెళ్లే దారిలో రోడ్డుకు రెండువైపులా ప్రయాణికుల కోసం నిలుపుతున్నారు. ఆటోలో పూర్తిగా ప్రయాణికులు ఎక్కేంత వరకు అక్కడి నుంచి కదలకుండా ట్రాఫిక్‌జామ్ చేస్తున్నారు. దీంతో ఆ రోడ్డున పోయే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆటో డ్రైవర్ల వద్ద మామూళ్లు తీసుకుంటూ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌జామ్‌ను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



రోడ్డును పూర్తిగా ఆక్రమించిన ఆటోవాలాలు

మూసాపేటకు వెళ్లే ప్రాంతంలో..

ఎర్రగడ్డ నుంచి మూసాపేటకు వెళ్లే ప్రాంతంలో బస్టాప్ ఉంది. ఇక్కడ సెవెన్ సీటర్ ఆటోలను నిలుపుతున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సెవెన్ సీటర్ ఆటోలు, ఆర్టీసీ బస్సులు రోడ్డు మధ్యలో నిలుపుతుండడంతో ట్రాఫిక్‌జామ్ అవుతోంది. ఎర్రగడ్డ చౌరస్తా నుంచి రైతుబజార్, ఈఎస్ఐ ప్రాంతం వరకు వాహనాలు స్తంభించిపోతున్నాయి. సాయంత్రం ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది.

ఆటోల్లో డెక్కులను నిషేధించాలి

షేరింగ్, సెవన్ సీటర్స్ ఆటోల్లో డెక్కులను నిషేధించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. డెక్కుల వాడకం వల్ల విపరీతమైన సౌండ్ పొల్యూషన్ ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ఆటోడ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్‌జామ్ కాకుండా చూడాలని వారు కోరారు.

ప్రమాదాలు ఇలా..

ఎర్రగడ్డ నుంచి మోతీనగర్ మీదుగా బోరబండకు వెళ్లే ఆటోల్లో డెక్కులను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వెనక వచ్చే వాహనాలు హారన్ కొట్టినా ఆటోడ్రైవర్లకు వినబడడం లేదు. దీనికితోడు ఆటోలను మితిమీరిన వేగంతో నడుపుతున్నారు. ఆటోలో కూర్చున్న ప్రయాణికులే ఆ వేగానికి భయపడుతున్నారు. గుంతల రోడ్డు కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మూసాపేట బ్రిడ్జి నుంచి బోరబండకు వెళ్లే దారి గుంతలమయంగా ఉండడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి.

కళింగలో జాతీయ చేనేత వస్త్రప్రదర్శన



ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న ప్రియాంక ఆనంద్‌చిలక

బంజారాహిల్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని కళింగ కల్చరల్‌హాల్లో జాతీయ చేనేత వస్త్రప్రదర్శనను మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటీఫుల్ 20 పోటీల్లో మిసెస్ కేటగిరీలో విజేతగా నిలిచిన ప్రియాంక ఆనంద్ చిలక ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని, నేటితరం యువత కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని తెలిపారు. నిర్వాహకులు జయేష్‌గుప్తా మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ వరకు కొనసాగనున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతిపని బృందాలు తమ సిల్క్, హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.



సోమాజిగూడలో జరిగిన సమావేశంలో మహేష్‌యాదవ్

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

బేగంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ ఎ.మహేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ సోమాజిగూడ డివిజన్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం అనుభవించిన వారు పార్టీని వీడి వెళ్లినా కార్యకర్తలు, నాయకులు అండగా ఉన్నారని తెలిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో సభకు వెళ్లేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌నగర్ ఏసీపీగా బాలగంగిరెడ్డి



అమీర్‌పేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్ ఏసీపీగా ఏసీ బాలగంగిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సౌత్ జోన్ స్పెషల్ బ్రాంచిలో ఏసీపీగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో చిలకలగూడ ఇన్‌స్పెక్టర్‌గానూ, సుల్తాన్‌బజార్ ఏసీపీగానూ బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏసీపీగా పనిచేసిన వెంకటరమణ సిటీ సెక్యూరిటీ వింగ్‌కు అదనపు ఎస్పీగా పదోన్నతిపై బదిలీ కాగా, ఆయన స్థానంలో నియమితులైన సీసీఎస్‌లో పనిచేసే కిరణ్ కుమార్ ఎస్ఆర్‌నగర్ ఏసీపీగా వచ్చారు. శనివారం కార్యాలయానికి వచ్చి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యతలు చేపట్టకుండానే నిమిషాల వ్యవధిలో వెనతిరిగారు. దాంతో బాలగంగిరెడ్డి ఏసీపీగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెరగాలి

పంజాగుట్ట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెరగాలని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి ప్రజలకు సూచించారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్‌మార్గ్‌లోని హెచ్ఎండీఏ మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన వాకథాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెంచుదామని, 'సురక్షిత భారత్ నిర్మిద్దాం' అనే నినాదంతో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించామని తెలిపారు. ఈ సంవత్సరం 8500 ఫైర్ రెస్క్యూ కాల్స్ రాగా వందలాది మందిని రక్షించామని తెలిపారు. ప్రమాదాలు జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లోనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. వాకథాన్‌లో రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ నారాయణరావు, డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన పార్వతీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన



పార్వతీ అమ్మవారు

బోరబండ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ హబీబ్ ఫాతిమానగర్‌లోని ఆలయ ప్రాంగణంలో శ్రీ పార్వతీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. మూడు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాలకు పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు హాజరయ్యారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీపురం వెంకటేష్, నాగవెల్లి సతీష్ పర్యవేక్షణలో పూజాధికాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



సికింద్రాబాద్‌లో అభ్యుదయ ఫెస్టివల్ 4.0 సందర్భంగా భరతనాట్యం ప్రదర్శిస్తున్న సుబ్బలక్ష్మి నృత్యశాల కళాబృందం

బేగంపేట, ఆంధ్రజ్యోతి



కేక్ చేస్తున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు బాలాజీ గోస్వామి, ఖైరతాబాద్ నాయకుడు నర్సింహులు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకుడు సలీం

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

బంజారాహిల్స్/బేగంపేట/యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఫిలింనగర్‌లో టీడీపీ రాష్ట్ర నాయకుడు బాలాజీ గోస్వామి, ఖైరతాబాద్ నాయకుడు నర్సింహులు కేక్ కట్ చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోవింద్, ఆటో సలీం, సాయికుమార్, మల్లేష్, అరవింద్ పాల్గొన్నారు. జూబ్లీహిల్స్‌లో జరిగిన వేడుకల్లో టీడీపీ నాయకులు సలీం, కె.యాదగిరి, విజయలక్ష్మి కేక్ కట్ చేశారు. బల్కంపేటలోని బీకేగూడ పార్కు వద్ద అన్నదానం చేశారు. దీనిని మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ప్రారంభించారు. తులసినగర్, అమీర్‌పేట, బేగంపేట, బన్సీలాల్‌పేట తదితర ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాలో బోనాల శ్రీనివాస్‌గౌడ్, శ్రీపతి సాయిసంప్రీత్, మల్లేష్, మురారిగౌడ్, ప్రవీణ్, ప్రసాద్, గిరి, శ్రీను, సాంబశివరావు, దేవి పాల్గొన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్ లేబర్‌అడ్డాలో నిర్వహించిన కార్యక్రమంలో ఏబీ మోహన్‌రావు, మహానంది, రత్నాకర్‌రావు, కృష్ణ, ప్రమీల, రూప్సీ పాల్గొన్నారు.



సనత్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేత శ్రీనివాస్‌గౌడ్ తదితరులు



బల్కంపేటలో అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, టీడీపీ నేతలు



శ్రీ కృష్ణానగర్ లేబర్ అడ్డాలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

● ఆదివారం.. ఆహ్లాదం





నగరంలో ఆదివారం మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారింది. ఆకాశం మబ్బులతో నిండి ఆహ్లాదకరంగా మారడంతో ఎన్టీఆర్ గార్డెన్స్ రోడ్డులో సెల్ఫీలు దిగుతూ సందర్శకులు ఉత్సాహంగా గడిపారు.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

నైపుణ్యాల అభివృద్ధితోనే అవకాశాలు



మాట్లాడుతున్న సయ్యద్ ముక్రం

పంజాగుట్ట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటేనే అవకాశాలను చేజిక్కించుకోగలమని ఫ్రెషర్స్ ప్లాట్ ఫామ్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఈవో సయ్యద్ ముక్రం అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ డిగ్రీలో కామర్స్ విద్యను పూర్తి చేసిన విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు తమ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.



విజేతలుగా నిలిచిన చిన్నారులు

ముగిసిన కరాటే పోటీలు

ఎర్రగడ్డ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏజీకాలనీలో రెండు రోజులుగా జరుగుతున్న కరాటే బుడోకాన్ జూనియర్ పోటీలు ఆదివారం ముగిశాయి. అబ్దుల్ గఫార్ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు బీజేపీ నేత డేరంగుల ప్రసన్న బ్లాక్ బెల్ట్‌లను అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రవీందర్, కార్యదర్శి ఉమేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

బోరబండ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఒంటిపై టిన్నర్ పోసుకొని నిప్పంటించుకున్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. ఫైనాన్షియర్ల ఒత్తిడి, అధిక వడ్డీలు కట్టలేక బోరబండ ఎస్ఆర్‌టినగర్‌కు చెందిన మొయిన్(40) గత సోమవారం రాత్రి ఒంటిపై టిన్నర్ పోసుకొని నిప్పంటించుకుని గాయాలపాలయ్యాడు. బోరబండ కార్పొరేటర్ ఎండీ బాబాఫసియుద్దీన్ అతడిని చికిత్స నిమిత్తం వెంటనే అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మొయిన్ ఆదివారం మృతిచెందాడు. పేదలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కొందరు ఫైనాన్షియర్లు అత్యధిక వడ్డీ వసూలు చేస్తున్నారని, ప్రజాప్రభుత్వం ఫైనాన్షియర్లపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బాబాఫసియుద్దీన్ డిమాండ్ చేశారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బేగంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని సనత్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని ముంబాయికి చెందిన సునీల్‌కుమార్ శర్మ(36) ఉపాధి కోసం నగరానికి వచ్చి క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజుకు వచ్చే రూ.500 సరిపోక ఈజీగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. అందుకు అనుగుణంగా బీదర్ నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి సనత్‌నగర్, బాలానగర్ ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఫతేనగర్‌లోని సికిందర్ మున్నా అన్సారి అనే వ్యక్తికి గంజాయి విక్రయిస్తుండగా సనత్‌నగర్ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. వీరి నుంచి 170 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

నిమ్స్‌లో బాణసంచా ఉంచారంటూ ఫిర్యాదు

● విచారణ చేస్తున్న పోలీసులు

పంజాగుట్ట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట నిమ్స్ ట్రామా భవనం ఐదో అంతస్తులోని ఓ గదిలో ఆరోగ్యశ్రీ సిబ్బంది అక్రమంగా బాణాసంచా ఉంచారంటూ నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిమ్స్ ఆస్పత్రి ట్రామా బ్లాక్ ఐదో అంతస్థులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా శనివారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. అదే అంతస్థులోని ఓ గదిలో అక్రమంగా బాణాసంచా ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో హాల్‌చల్ అయింది. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ సిబ్బంది అక్రమంగా బాణసంచా ఉంచారంటూ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇప్పటికే పోలీసులు ఐదో అంతస్థులోని అన్ని గదులను తనిఖీ చేశారు. వారికి బాణసంచా లభ్యం కానట్టు తెలిసింది. నిమ్స్ ఆవరణలో, పలు బ్లాక్‌లలో సీసీ కెమెరాలు ఉండగా, ఐదవ అంతస్థులో మాత్రం సీసీ కెమెరాలు లేనట్టు తెలిసింది. ఇదే అంతస్థులో అదనపు మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఉన్నట్టు తెలిసింది. మరి ఇక్కడ సీసీ కెమెరాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



ఈస్టర్ వేడుకల్లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్



రహ్మత్‌నగర్ బాప్టిస్ట్ చర్చిలో భక్తిగీతాలను ఆలపిస్తున్న సండే స్కూల్ విద్యార్థినులు



ఎస్పీఆర్‌హిల్స్ పెనుయేలు గాస్పెల్ మినిస్ట్రీస్ చర్చిలో భక్తులను ఆశీర్వదిస్తున్న పాస్టర్ ప్రేమ్‌సాగర్

బంజారాహిల్స్/బోరబండ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని షారోస్ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకలకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రపంచాన్ని శాంతి మార్గంలో నడిపించేందుకు ఏసు ప్రభు చేసిన కృషి మరవలేనిదన్నారు. ప్రజలు కూడా కుట్రలు, కుతంత్రాలు వదిలేసి ప్రశాంత జీవితాన్ని గడపాలని సూచించారు. ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ తనను శిలువ వేసినా ప్రజలు మాత్రం శాంతి మార్గాన్ని వీడొద్దు అని జీసెస్ బోధించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో చర్చిఫాదర్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్, బీజేఆర్‌నగర్‌లోని పెనుయేలు గాస్పెల్ మినిస్ట్రీస్ చర్చిలో భక్తి గీతాలాపన, ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పేదమహిళలకు మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ ప్రేమ్‌సాగర్, పాస్టరమ్మ రత్నమ్మ దుస్తులు పంపిణీ చేశారు. బాప్టిస్ట్ చర్చిలో విస్తరించిన ప్రదేశాన్ని పాస్టర్ రెవరెండ్ డాక్టర్ వి.జె.సుందర్ కుమార్ ప్రారంభించారు.


దుర్గా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

దుర్గా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

మారేడుపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : సీతాపతి కాలనీలో దుర్గా అమ్మవారు ఆలయంలో 17 నుంచి 20 వరకు శ్రీసిద్ధి వినాయక, దుర్గామాత అమ్మవారు, అమృత కండేశ్వర్ శివలింగం విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలను నాలుగు రోజుల పాటు నిర్వహించారు. దేవతామూర్తుల ప్రాణప్రతిష్ఠలతో పాటు ఆదివారం కుంభాభిషేకం జరిగాయి. కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, సి.వైష్ణవి, పి.నళిని కిరణ్, పరమేష్, నిర్వాహకులు జి.చంద్రశేఖర్, జి.సాయి ప్రసాద్, జి.సత్యనారాయణ, జి.దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి

రజతోత్సవ సభ పోస్టర్లు ఆవిష్కరణ

సికింద్రాబాద్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పై ప్రజల్లో అసహనం పెరిగిందని, తిరిగి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని అన్నివర్గాల ప్రజలు ఎదురు చూస్తున్నారని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బోయినపల్లిలో జరిగిన కంటోన్మెంట్ 1వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సన్నాహాలు, జన సమీకరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 27న బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసి, వరంగల్ సభకు దండులా కదలుదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ రజతోత్సవ సభ అనంతరం రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు తథ్యమని జక్కుల అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు అన్ని వర్గాల ప్రజల్లో నూతనోత్సాహం పెల్లుబుకుతుందని అన్నారు.


అవగాహన సదస్సులో పాల్గొన్న డీసీపీ రష్మీ

మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన

● నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్

తిరుమలగిరి ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు. ఆదివారం తిరుమలగిరి టీచర్స్ కాలనీ సమీపంలోని ఎంఎస్‌బీ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ అవుట్‌రీచ్‌లో భాగంగా అవగాహన సదస్సులో పాల్గొన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సైబర్ భద్రత, మాదక ద్రవ్యాలు, అత్యవసర ప్రతిస్పందన సంసిద్ధతలపై వారికి అవగాహన కల్పించారు. పోలీసుల ద్వారా తక్షణ సహాయానికి డయల్ 100, సైబర్ మోసాలను నివారించడానికి 1930 ప్రాముఖ్యతను వినియోగంతో సహా అత్యవసర సహాయం మార్గాల గురించి తెలియచేశారు. సదస్సులో 9 నుంచి 12తరగతుల వరకు సుమారు 115మంది విద్యార్థులు, పాఠశాల సిబ్బంది సైబర్ నేరాల గురించి పలు ఆసక్తిగల ప్రశ్నలను డీసీపీ ద్వారా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, యాజమాన్యంతో పాటు బోహర ముస్లిం కమ్యూనిటీ సభ్యుడు యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు కృషి చేస్తా


వాల్మీకినగర్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జె.రామకృష్ణ

మారేడుపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రజలకు తాగునీరు ఇబ్బంది లేకుండా కృషి చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ వార్డు 5 వాల్మీకినగర్‌లో పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడారు. తాగునీరు సమస్య తీవ్రంగా ఉందని తాగునీటి సరఫరా పెంచాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకుని వెళ్లి పరిష్కరించేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యదర్శికి సన్మానం

అడ్డగుట్ట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన న్యాయవాది గుంజి సంతోష్ కుమార్ వడ్డెరాజ్‌కు ఆదివారం మహబుబ్‌నగర్ మన్వాడ మండల వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు బాలయ్య, కార్యదర్శి వెంకటేష్‌ల బృందం సభ్యులు కలిసి సికింద్రాబాద్‌లో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బేగంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని సనత్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని ముంబాయికి చెందిన సునీల్‌కుమార్ శర్మ(36) ఉపాధి కోసం నగరానికి వచ్చి క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజుకు వచ్చే రూ.500 సరిపోక ఈజీగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. అందుకు అనుగుణంగా బీదర్ నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి సనత్‌నగర్, బాలానగర్ ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఫతేనగర్‌లోని సికిందర్ మున్నా అన్సారి అనే వ్యక్తికి గంజాయి విక్రయిస్తుండగా సనత్‌నగర్ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. వీరి నుంచి 170 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థిని అదృశ్యం


శ్రావణి (ఫైల్)

బౌద్ధనగర్, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): పరీక్ష రాయడానికి కాలేజీకి వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై హమాజనాయక్ వివరాల ప్రకారం కవాడిగూడ పద్మశాలికాలనీకి చెందిన గిరిరాజు శ్రావణి(20) 19న మధ్యాహ్నం ఒంటిగంటకు పద్మారావునగర్‌లో ఓ కాలేజీలో సెమిస్టర్ పరీక్ష రాయడానికి వెళ్లింది. రాత్రయినా శ్రావణి ఇంటికి చేరుకోకపోవటంతో కుటుంబసభ్యులు ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావటంతో పలుచోట్ల గాలించిన ఫలితం లేదు. దీంతో తన అక్క కుమార్తె కనిపించటంలేదని మావయ్య లక్ష్మణ్ ఆదివారం చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


క్రీడలకు అనువుగా మైదానాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

క్రీడల శిక్షణ కేంద్రంగా..

బైసన్ పోలో గ్రౌండ్

రూపురేఖలు మారుతున్న ప్రాంతం

కంటోన్మెంట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దే పనులు షురూ ● 13 ఏళ్ల తర్వాత విజయవంతంగా జరిగిన పోలో మ్యాచ్

సికింద్రాబాద్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బైసన్ పోలో గ్రౌండ్‌లో పిచ్చి మొక్కలు, గుబురుగా పెరిగిన చెట్లతో నిండిన ఈ మైదానాన్ని కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం క్రీడా కాంప్లెక్స్‌గా రూపుదిద్దే పనిలో నిమగ్నమైంది. దేశంలోని ఏ కంటోన్మెంట్‌లో లేని విధంగా అత్యున్నత క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. కొద్ది రోజులుగా మైదానంలోని పిచ్చి మొక్కలు తొలగించడం, మైదానాన్ని చదును చేయడం తదితర పనులు చేపడుతోంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ ప్రత్యేక చొరవ చూపడంతో అతి కొద్ది రోజుల్లోనే బైసన్ పోలో గ్రౌండ్ రూపురేఖలు మారుతున్నాయి. తొలుత పోలో క్రీడ కోసం మైదానాన్ని సిద్ధం చేయాలన్న లక్ష్యంతో పని చేసిన కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం ఈ మేరకు విజయం సాధించడం గమనార్హం. 13 సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత శుక్రవారం బైసన్ పోలో గ్రౌండ్‌లో పోలో మ్యాచ్ జరగడం విశేషం. ఈ మ్యాచ్‌కు ఆర్మీ ఉన్నతాధికారులతోపాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐడీఈఎస్ తదితర ర్యాంకుల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ గ్రౌండ్‌కు పూర్వ వైభవం రావడంపై హర్షం ప్రకటించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు చెందిన బైసన్ పోలో మైదానం 34 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ మైదానంలో పోలో క్రీడలు, ఎన్‌సీసీ శిక్షణ కార్యకలాపాలు జరుగుతుంటాయి.


ప్రేక్షకుల గ్యాలరీని తీర్చిదిద్దుతున్న సిబ్బంది

ఈ మైదానాన్ని సరిగ్గా వినియోగించుకోకపోవడంతో పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలు, రాజకీయ పార్టీల సభలు, సమావేశాలకు వచ్చే వాహనాల పార్కింగ్‌గా తయారైంది. కాగా నగరం నడిబొడ్డున ఉన్న ఈ విశాలమైన మైదానాన్ని సద్వినియోగం చేయాలని, ముఖ్యంగా జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు పుట్టినిల్లుగా ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో క్రీడావ్యాప్తికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి అనువుగా రూపొందించాలని మధుకర్ నాయక్ భావించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దాలని ప్రతిపాదనలు రూపొందించారు. గడిచిన కంటోన్మెంట్ పాలక మండలి సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించగా ఆంధ్రా, తెలంగాణ సబ్ ఏరియా కమాండర్, బోర్డు అధ్యక్షుడు సైతం దీనిని బలపరచారు. బైసన్ పోలో గ్రౌండ్ పేరు స్థానంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా నామకరణం చేయాలని కూడా సూచించారు. దాంతో మధుకర్ నాయక్ ఈ అంశాన్ని రక్షణ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లారు. వారి నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో మైదానాన్ని క్రీడలకు అనువుగా రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. మిలిటరీ అధికారుల ప్రతిపాదన మేరకు తాజాగా పోలో మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించారు.


బైసన్ పోలో గ్రౌండ్‌లో జరిగిన పోలో మ్యాచ్‌కు హాజరైన ఆర్మీ అధికారులు


బైసన్ పోలో గ్రౌండ్‌లో ఆర్మీ అధికారులతో కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్

అద్భుతంగా తీర్చిదిద్దారు

తక్కువ సమయంలో బైసన్ పోలో గ్రౌండ్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారంటూ రక్షణ శాఖ జనరల్ ఆఫీసర్ కమాండ్(జీఓసీ) ఇన్ చీఫ్ అజయ్ మిశ్రా, ఆంధ్రా, తెలంగాణ సబ్ ఏరియా కమాండర్, కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ నంజుండేశ్వర్ తదితర ఉన్నతాధికారులు కంటోన్మెంట్ హెల్త్ సూపరింటెండెంట్ ఎం.దేవేందర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అశుతోష్ చౌహాన్‌లను ప్రత్యేకంగా అభినందించారు. వారిని బొకేలతో అభినందనలు తెలిపారు.


కంటోన్మెంట్ హెల్త్ సూపరింటెండెంట్ ఎం.దేవేందర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అశుతోష్ చౌహాన్‌లను అభినందిస్తున్న జీఓసీ ఇన్ చీఫ్ అజయ్‌మిశ్రా, బ్రిగేడియర్ నంజుండేశ్వర్

ఇక ఇక్కడ నో పార్కింగ్

కంటోన్మెంట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా రూపొందించే కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో ఇక నుంచి ఈ మైదానాన్ని వాహనాల పార్కింగ్‌కు ఇవ్వకూడదని అధికారులు నిర్ణయించారు. ఈ విషయమై లిఖిత పూర్వక లేఖ పంపించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మైదానాన్ని క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దుతున్నందున భవిష్యత్‌లో పార్కింగ్‌ను అనుమతించేది లేదని, ప్రభుత్వం పరేడ్‌గ్రౌండ్‌లో ఏ కార్యక్రమమైనా నిర్వహించాలనుకుంటే పార్కింగ్ వసతి విషయమై ఆలోచించుకోవాలని లేఖలో కోరనున్నట్టు తెలిసింది.


మైదానాన్ని చదును చేస్తున్న దృశ్యం

పలు క్రీడల్లో శిక్షణ

ప్రస్తుతం పికిల్ బాల్ గేమ్ విశేషంగా ప్రాచుర్యంలోకి వస్తోంది. అందుకే ఈ గేమ్‌తోపాటు క్రికెట్, ఫుట్‌బాల్, పోలో, టెన్నిస్, బాస్కెట్‌బాల్ తదితర క్రీడల్లో శిక్షణనిచ్చే విధంగా మైదానాన్ని రూపొందిస్తున్నాం. ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను అందించిన సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మరింత మంది ఆణిముత్యాలను అందించేందుకు మా వంతు కృషి చేస్తాం.

- మధుకర్ నాయక్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి


సోమాజిగూడలో జరిగిన సమావేశంలో మహేష్ యాదవ్

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

బేగంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ ఎ.మహేష్ యాదవ్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ సోమాజిగూడ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం అనుభవించిన వారు పార్టీని వీడి వెళ్లినా కార్యకర్తలు, నాయకులు అండగా ఉన్నారని తెలిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో సభకు వెళ్లేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సమ్మేళనం

తిరుమలగిరి ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంద సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంలో ఆదివారం సికింద్రాబాద్ బాగ్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నిర్వహించిన సమ్మేళనంలో భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు భానుక మల్లికార్జున్, నగర వ్యాప్తంగా ఉన్న 78 శాఖలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ జీ పాల్గొన్నారు.


బోయినపల్లి ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న అలనాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు

విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బోయినపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): 50 సంవత్సరాల క్రితం బోయినపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం బోయినపల్లిలోని ఎంఆర్ బాంకెట్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు కలుసుకొని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ నేపథ్యంలో వారికి విద్యను అందించిన ఉపాధ్యాయులైన ఆకుల శ్రీశైలం, ఆండాలు, ప్రమీల, గౌసుద్దీన్‌లకు పాదాభివందనాలు చేసి సన్మానించారు. ముఖ్యఅతిథులుగా ఇదే పాఠశాలలో చదువుకున్న ఓల్డ్ బోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌తోపాటు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డిలు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బండి రామకృష్ణ, ఎస్.పాండు, రఘువీర్ సింగ్, సుధాకర్, కొండల్ యాదవ్, విక్రమ్, నరేంద్ర ఆచార్య, ఈశ్వర్, సురేష్, వెంకట్ రెడ్డి, మల్లికార్జున్, కృష్ణారెడ్డి, మధు, ఎస్.వెంకటేష్, బలరాం యాదవ్, గణేష్‌చారి పాల్గొన్నారు.


గ్యారిసన్ వెస్లీ చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

ఈస్టర్ వేడుకలు

తిరుమలగిరి ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ వేడుకలు బొల్లారం, తిరుమలగిరి లోని చర్చిలలో ఆదివారం ఘనంగా జరిగాయి. బొల్లారం హోలీ ట్రినిటీ చర్చిలో రెవరెండ్ ఫాదర్ కే. చార్లస్ వెస్లీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రసంగికులు రెవరెండ్ శేఖర్ కిరుబాకరణ్, పీటర్ విగ్‌లు ప్రసంగించారు. చర్చి సెక్రటరీ సీహెచ్ సుందర్‌రావు, కమిటీ మెంబర్స్ అన్ని ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా తిరుమలగిరి లాల్‌బజార్‌లోని గ్యారిసన్ వెస్లీ చర్చిలో ఈస్టర్ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. బిషప్ ప్రిసిల్ల మేరీ దేవుని వాక్యం అందజేశారు. ఈస్టర్ శుభ సమయంలో యేసు నామములతో పాపానికి విమోచనం ఉందని ఆమె భక్తులతో పంచుకున్నారు. ప్రొఫెసర్ రెవరెండ్ డాక్టర్ రాజేశ్వర్ సాలమన్, ఆయన బృందం ఉపదేశం ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాది జేమ్స్, సునితా, గ్యాబ్రియల్, సుకన్యలు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మానవ సేవయే మాధవ సేవగా భావించి సామాజిక దృక్పథంతో ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో జీరా క్లబ్ ఆధ్వర్యంలో కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని జీరా క్లబ్ అధ్యక్షుడు గౌరీ శంకర్ తెలిపారు. 1937లో ప్రారంభమైన జీరా క్లబ్ సమక్షంలో ఇప్పటివరకు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 300 మందికి పైగా బీపీ, మధుమేహం, కంటి పరీక్షలతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారని వివరించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌రావు, కోశాధికారి మురళీధర్, కార్యవర్గ సభ్యులు వినోద్ కుమార్, కమల్ కిషోర్ అగర్వాల్, మహమ్మద్ షరీఫ్, జగన్నాథం, శంకర్ గాజుల, శ్రీరంగ్ ఓజా పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

తిరుమలగిరి ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎలకతుర్తిలో 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు కంటోన్మెంటు, బొల్లారం నుంచి కార్యకర్తలు పార్టీ అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ పిలుపునిచ్చారు. బొల్లారంలో బోర్డు మాజీ సభ్యుడు లోకనాథ్ ఏర్పాటుచేసిన రజతోత్సవ సన్నాహక కమిటీ సమావేశంలో ప్రసంగించారు. తెలంగాణ ప్రజలందరూ ఒకటై సభకు విచ్చేసి మద్దతు పలకాలన్నారు. పార్టీ సీనియర్ నాయకులు మురళీ యాదవ్, వార్డు-8 అధ్యక్షుడు రవికుమార్, శివ, సుశీల్ గౌడ్, సురేందర్, రవి, గౌరమ్మ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళులు


నివాళులర్పిస్తున్న దళిత బహుజన ఫ్రంట్ సభ్యులు

బౌద్ధనగర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మహిళ హక్కుల ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అన్నారు. సీతాఫల్‌మండిలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి 20వ వారం జ్ఞానమాలను వేశారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా మహిళలకు సమాన హక్కులు అమలవుతున్నాయని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిత్ర, పరమేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు


వారాసిగూడ చౌరస్తాలో చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌రావు


బల్కంపేటలో అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, టీడీపీ నేతలు

బౌద్ధనగర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నామాలగుండులో టీడీపీ సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు జీవీ కృష్ణ, వారాసిగూడ చౌరస్తాలో బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు గరిగే ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్ పాల్గొని కేక్‌ను కట్ చేశారు. పేదలకు పండ్లను పంపిణీ చేశారు. నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరిటాల విజయ్‌కుమార్, వెంకటస్వామి, నరేంద్ర, శంకర్, పిట్ల శంకర్‌ముదిరాజ్, పొట్టి శ్రీను, చంద్రమోహన్, చిరంజీవి, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారంలో ..

తిరుమలగిరి ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి పార్లమెంటు టీటీడీపీ అడహాక్ కమిటీ సభ్యుడు జనగామ నర్సింగరావు ఆధ్వర్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంటు నియోజకవర్గంలో బొల్లారం త్రిషూల్ పార్క్ పాఠశాలలో సన్నిహిత అనాథ ఆశ్రమంలో నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు జన్మదిన వేడుకలు జరిగాయి. తెలంగాణ తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కాని నర్సింలు విచ్చేసి అనాథాశ్రమంలో పిల్లలకు అన్నదానం, నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం నాయకులు అశోక్ యాదవ్, మధు సూదన్ రావు, డీఆర్ శ్రీనివాస్, అనురాధ, ప్రతాప్, సుదర్శన్, రాజేష్, ఎస్‌కే బాబు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బల్కంపేటలో..

బేగంపేట, సనత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలు సనత్‌నగర్ నియోజకవర్గంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బల్కంపేటలోని బి.కె.గూడ పార్క్ వద్ద చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన కార్యక్రమంలో పాల్గొని అన్నదానం చేశారు.

● సనత్‌నగర్‌లోని తులసనగర్‌లో చంద్రబాబు జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద నాయకులు కేక్ కట్ చేశారు. అలాగే అమీర్‌పేట, బేగంపేట, బన్సీలాల్‌పేట తదితర ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో నాయకులు బోనాల శ్రీనివాస్‌గౌడ్, శ్రీపతిసాయి సంప్రీత్ , మల్లేష్, మురహరి గౌడ్, ప్రవీణ్, ప్రసాద్, గిరి, శ్రీను, సాంబశివరావు, దేవి తదితరులు పాల్గొన్నారు.